ప్రజాశక్తి
సోమవారం 27 నవంబర్ 2023
5
విజయనగరం



క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక లీ ప్యారడైజ్‌లో ఆదివారం క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ ఎక్స్‌పోను డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో కృషి, ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో మూడు జిల్లాల నుంచి అనేక నిర్మాణ సంస్థలు ప్రదర్శనలు ఏర్పాటు చేశాయి. ప్రాపర్టీ షోలో క్రెడాయ్ ప్రతినిధులు చంద్రబోస్, రాజ్ కుమార్, సభ్యులు, అనేక సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న కోలగట్ల, మజ్జి

అన్నదాతకు అండగా ఉండేందుకు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్న వైసిపి సర్కారు... ఈ ఏడాది రెండో విడత రైతుభరోసా నగదును నేటికీ విడుదల చేయలేదు. సిఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి 20 రోజులైనా రైతుల ఖాతాల్లోకి నిధులు చేరలేదు. రైతు భరోసా నగదు కోసం జిల్లా వ్యాప్తంగా రైతన్నలు ఎదురు చూస్తున్నారు. రైతు భరోసా నగదు జమైందా? లేదా? అని ప్రతిరోజూ సచివాలయాలు, బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలుచేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు, రైతుసంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బటన్ నొక్కి 20 రోజులు
రైతుల ఖాతాల్లో జమ కాని నగదు
ఎదురుచూపులు చూస్తున్న అన్నదాతలు
సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

రైతుకందని భరోసా



రైతు భరోసా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య (ఫైల్)

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 7న పుట్టపర్తిలో సిఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి రైతు భరోసా పథకం నగదు వేస్తున్నట్లు ప్రకటించారు. బటన్ నొక్కి దాదాపు మూడు వారాలు కావస్తున్నా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి భరోసా నగదు జమ కాలేదు. సిఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారం రోజుల తర్వాత, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ 15వ విడత నగదు పంపిణీని ప్రారంభించిన మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమైంది. 20 రోజులైనా రైతు భరోసా నగదు జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతు భరోసా నగదుపై ఆశలు వదులుకుంటున్నారు.

98 శాతం రైతులకు జమ కాని భరోసా

జిల్లాలో 2,63,394 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ద్వారా సుమారు రూ.52.67 కోట్లు జమ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా నగదు జిల్లాలో 98 శాతం మంది రైతులకు ఇంకా జమకాలేదు. సిఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కిన రోజు రెండు శాతం మందికి జమ చేసి, మిగిలిన రైతులకు చేయలేదని విమర్శలు వస్తున్నాయి. రైతు భరోసాపై ఏ రైతును అడిగినా ఇంకా నగదు రాలేదని చెప్పడం గమనార్హం. గతంలో బటన్ నొక్కిన నాలుగైదు రోజుల్లోనే 70, 80 శాతం రైతుల ఖాతాలకు నగదు జమయ్యేది. ఈసారి 20 రోజులు గడిచినా ఇప్పటికీ రైతు భరోసా జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల చుట్టూ తిరుగుతూ రైతు భరోసా ఎప్పుడు వస్తుందని, అసలు తమకు వస్తుందా? లేదా? అని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.

'స్టేటస్' ఎక్కడ?

రైతు భరోసా బటన్ నొక్కిన రెండు రోజుల తర్వాత రైతులు నగదు జమ అయిందో, లేదో తెలుసుకునేందుకు స్టేటస్ యాప్‌ను ప్రభుత్వం ఇచ్చేది. యాప్ ఆధారంగా రైతులు తమ స్టేటస్ చెక్ చేసుకునేవారు. ఒకవేళ రైతు భరోసా జమ కాకపోతే ఎందుకు జమ కాలేదో యాప్‌లో చూపించేవారు. రైతు భరోసా బటన్ నొక్కి మూడు వారాలు కావస్తున్నా ప్రభుత్వం యాప్ ఇవ్వలేదు. యాప్ ఇస్తే రైతులు నుంచి విమర్శలు వస్తాయనే భయంతో ఇవ్వలేదని విమర్శలు వస్తున్నాయి.

ఇంకా జమకాలేదు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా నగదు ఇంకా జమ కాలేదు. రైతు భరోసా వస్తే వరి కోతల మదుపునకు ఉపయోగ పడతాయి. 20 రోజులైనా ఇంకా డబ్బులు రాలేదు. గతంలో ఎన్నడూ ఇలా కాలేదు. ప్రభుత్వం స్పందించి రైతు భరోసా నగదు వెంటనే జమ చేయాలి.

– యు.ప్రసాద్, రైతు, రంగరాయపురం, బొబ్బిలి మండలం

రైతులకు మోసం

రైతు భరోసా బటన్ నొక్కి మూడు వారాలు కావస్తున్నా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయకపోవడం అన్యాయం. రైతు భరోసా బటన్ నొక్కి డబ్బులు జమ చేయకుండా రైతులను మోసం చేస్తున్నారు. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎస్.గోపాలం, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

పర్యవేక్షణ పేరుతో వేధింపులా?

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా 49వ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులంతా ఒకే సామర్థ్యంతో ఉండరని, దీన్ని పట్టించుకోకుండా ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదని చెప్పారు. సిపిఎస్, జిపిఎస్ కాకుండా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిలబస్‌లో చరిత్ర పాఠాలను, గుజరాత్ అల్లర్లను, గాంధీ హత్య, డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, ఆవర్తన పట్టిక, పోరాటాలు వంటివి తొలగించడమంటే ఇప్పుడున్న విద్యార్థులకు చరిత్ర గురించి అవగాహన లేకుండా చేయడమేనని అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ దృక్పథంలో ఆలోచన లేకుండా చేయడం వంటివి దేశాన్ని తిరోగమన పద్ధతిలో వెళ్లడానికి దారితీస్తుందని, ఇది చాలా ప్రమాదమని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి సామాజిక బాధ్యతగా యుటిఎఫ్ కృషి చేస్తోందన్నారు. పర్యవేక్షణపై ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి యుటిఎఫ్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రవీంద్ర వ్యవహరించారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎ.సత్య శ్రీనివాస్, వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, సిహెచ్ బాస్కరరావు, ఎం.అప్పలనాయుడు, జి.పద్మావతి, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రమేష్, ఈశ్వరరావు

అనంతరం యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా మీసాల అప్పలనాయుడు, అధ్యక్షులుగా రమేష్‌చంద్ర పట్నాయక్, ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సహాధ్యక్షులుగా వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా సిహెచ్ భాస్కరరావు, కార్యదర్శులుగా కె.ప్రసాదరావు, జివి రమణ, పి.త్రినాథ, పి.వాసు, పి.వాసుదేవరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, ఎం.కేశవరావు, ఎన్.సత్యనారాయణ, బి.రామినాయుడు, ఆర్‌వివి సూర్యారావు, జి.రాజారావు, శ్రీదేవి, వి.రాధాభవాని, సూరి, శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.విజయగౌరి, డి.రాము, కె శ్రీనివాసరావు, ఎ.సత్యశ్రీనివాస్, కె.అప్పారావు, జి.పద్మావతి, సిహెచ్ వైకుంఠరావు ఎన్నికయ్యారు.

మౌఖిక ఆదేశాలతో లీలావతి పర్యటన

- ఎట్టకేలకు తేల్చేసిన అధికారులు
- 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అపరిచిత వ్యక్తి అనధికార పర్యవేక్షణపై అధికారులు ఎట్టకేలకు తేల్చారు. లీలావతి అనే మహిళ ఈ నెల 22, 24 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అనధికారిక సమీక్షలు, పరిశీలనలు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో 'ఎవరీ అజ్ఞాతవాసి' అనే శీర్షికతతో ఈ నెల 23న, 'మౌనం వెనుక మర్మమేమిటో' అన్న శీర్షికతో ఈ నెల 26న ప్రజాశక్తిలో ప్రత్యేక కథనాలు వెలువడిన విషయం విదితమే. దీనిపై విజయనగరం డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఎట్టకేలకు స్పందించారు. ఉపాధి హామీ పనుల వీడియో డాక్యుమెంటేషన్, సక్సెస్ స్టోరీ రూపొందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా కమిషనర్.. లీలావతిని నియమించారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీడీ ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్ మౌఖిక ఆదేశాలతో భోగాపురం మండలం నందిగాం వచ్చారని కూడా వెల్లడించారు. 23న వచ్చిన కథనం వచ్చేటప్పటికి లీలావతి ఫీల్డ్ విజిట్‌పై తనకు ఎలాంటి సమాచారమూ లేదంటూ డ్వామా పీడీ ప్రజాశక్తికి చెప్పడం గమనార్హం. మొత్తానికి లీలావతి పర్యటన కమిషనర్ మౌఖిక ఆదేశాలతో జరిగినట్టు అధికారులు తేల్చేశారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ, మహిళలు

హింస నిరోధానికి కఠిన చర్యలు

ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో మహిళలపై జరుగుతున్న హింస నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ డిమాండ్ చేశారు. హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలో 46 డివిజన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, అశ్లీల సాహిత్యం, చానళ్లలో ప్రచారాలు, సెల్‌ఫోన్లలో అశ్లీల చిత్రాలు, వీడియోలు, పాశ్చాత్య సంస్కృతి విస్తరించి నేటి యువత దారి తప్పుతోందన్నారు.

ఫలితంగా రోజురోజుకూ మహిళలపై ఆత్యాచారాలు, హత్యలు, గృహహింస పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీన్ని నివారించేందుకు పాలకులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్న పోర్న్‌ను నిషేధించాలని, అందాల పోటీలు నిర్వహించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు పుణ్యవతి, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

భారత రాజ్యాంగంలో ఉద్యోగులకు కార్యనిర్వహణలో కీలకమైన బాధ్యత ఉందని, వారంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పైస్థాయి నుండి కింది స్థాయి వరకూ విధులు రాజ్యాంగ బద్ధంగా, సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నో సవరణలు చేసినా పీఠిక స్వరూపం మారలేదని, అంత ఉన్నతంగా మన రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌ఒ అనిత సభాధ్యక్షత వహించగా, మెప్మా పీడీ సుధాకర్ తదితరులు రాజ్యాంగ విశిష్టతపై మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞను జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి కె.సందీప్ చదవగా, పాల్గొన్న వారంతా వారిని అనుసరించి చదివారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ దేవ్‌ప్రసాద్, సిబ్బంది, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు

విజయనగరంటౌన్ : రాజ్యాంగ స్ఫూర్తితోనే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించి సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్తు కార్యాలయంలో బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, కె.వి.సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసంలోని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరిసహస్ర కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రాజ్యాంగాన్ని రక్షించాలంటే వైసిపిని గద్దెదించాలి

విజయనగరం టౌన్ : వైసిపి సర్కారును ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని, ప్రభుత్వ వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటవ్వాల్సిన ఆవశ్యకత ఉందని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్రంలో ప్రజా పాలన రావాలి.. సైకో రాజ్యం పోవాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆదాడ మోహన్ రావు, పితాల లక్ష్మి, దుప్పాడ జ్యోతి, ఏంటి రాజేష్, పిడుగు సతీష్, గొల్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జారాకు బంగారు పతకం

బంగారు పతకంతో జారా

విజయనగరం టౌన్ : ఈ నెల 22 నుంచి 26 తేదీ వరకు బెంగళూరులో జరిగిన జాతీయ బెంచ్ ప్రెష్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.జారా బంగారు పతకం సాధించింది. 69 కేజీల విభాగంలో 90 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది.

28న జిల్లాలో పురందేశ్వరి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 28న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి జిల్లాకు వస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి శ్రీనివాస్ వర్మతో కలిసి ఆయన మాట్లాడారు. వైజంక్షన్ వద్ద పురందేశ్వరికి ఘనస్వాగతం పలకనున్నట్లు చెప్పారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం తోటపాలెంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో బూత్ కమిటీలు, శక్తికేంద్ర ప్రముఖులతో సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి మన్నెం సురేష్, మజ్జి రమేష్ బాబు, యువమోర్చా జిల్లా అధ్యక్షులు పి.నవీన్ కుమార్, మన్నెం శ్యాంసుందర్, ఇప్పిలి గోపాలకృష్ణ, శంబర లక్ష్మీనరసింహం, జి.రమేష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల కష్టాలను గుర్తించింది పవనే

విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్రలో ఉన్న మత్స్యకారుల కష్టాలను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే గుర్తించారని ఆ పార్టీ మత్స్యకార వికాస విభాగం సభ్యులు గనగల రాజు తెలిపారు. ఆదివారం పాల్‌నగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ హార్బర్‌లో జరిగిన బోటు ప్రమాద బాధితులకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం చెయ్యడంపై మత్స్యకారులందరి తరఫున పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రౌతు సతీష్, సారిక మురళి, ఎ.చక్రవర్తి, దాసరి యోగేష్, కె.రామకృష్ణ, చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ స్థానిక సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని 43వ డివిజన్ పరిధిలో ఉడాకాలనీ ఫేజ్-2లో నిరుపయోగంగా ఉన్న పార్కు ప్రాంతాన్ని పరిశీలించారు. పార్కు నిరుపయోగంగా ఉండడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పార్కు పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పర్యవేక్షణ బాధ్యత స్థానికులే తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ఇప్పటికే నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి చూపించామన్నారు. ప్రజలు మరోసారి అవకాశమిస్తే మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సత్యవతి, వైసిపి డివిజన్ అధ్యక్షులు వంతరం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించే నిమిత్తం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 25 నుంచి ఆరు మండలాల్లో ప్రారంభించారు. మిగిలిన 21 మండలాలకు షెడ్యూల్ విడుదల చేసినట్లు ఈ కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 5న సంతకవిటి, 6న డెంకాడ, 8న వేపాడ, 9న గుర్ల, 12న మెరకముడిదాం, 13న బొండపల్లి, 19న పూసపాటిరేగ, 22న రేగిడి ఆమదాలవలస, ఎల్.కోట, 27న తెర్లాం, గజపతినగరం, 30న గరివిడి మండలాల్లో ప్రారంభమవుతుందని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 1న భోగాపురం, 7న కొత్తవలస, 11న మెంటాడ, వంగర, 12న జామి, బాడంగి, 14న చీపురుపల్లి, 19న బొబ్బిలి, 23న రామభద్రపురం మండలాల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

చెల్లూరులో వికసిత్ భారత్ యాత్ర

విజయనగరం రూరల్ మండలం చెల్లూరులో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం మొత్తం ఈ యాత్రల్లో భాగంగా ప్రజలకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో రౌడీ రాజ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందని, ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారని టిడిపి బిసి సెల్ నాయకులు కంది మురళీనాయుడు ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఉద్యోగులు వారి హక్కులను కాపాడుకోలేకపోతున్నారని చెప్పారు. చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి, పసలేని కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు.

నాయకులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 నుంచి బిసిలకు ఏదో న్యాయం చేశామని గడపగడపకు తిరుగుతూ ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్తున్నారని, కానీ ఏమి న్యాయం చేశారనేది ప్రజలకు స్పష్టంగా చెప్పడం లేదన్నారు. బిసిలను మోసగించారని దీన్నిబట్టే అర్థమౌతోందని చెప్పారు.

అశోక్‌ను కలిసిన నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజును ఆయన నివాసంలో ఆ పార్టీ నగర మాజీ అధ్యక్షులు కర్రోతు వెంకట నర్సింగరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులుగా నర్సింగరావును నియమించిన నేపథ్యంలో అశోక్‌ను కుటుంబసభ్యులతో కలిసి, ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అశోక్ దంపతులను సన్మానించారు.

అశోక్ గజపతిరాజు దంపతులను సన్మానిస్తున్న కర్రోతు వెంకట నర్సింగరావు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- రామభద్రపురం

భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడేది రాజ్యాంగమేనని, రాజ్యాంగాన్ని పరిరక్షించే ప్రతీ ఒక్కరు పాలకులు, అధికారులు పౌరులు దేశభక్తి కలిగిన వారేనని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాయుడు వలస పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠకులు, లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేవి కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. శివరామకృష్ణ తెలిపారు. ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో రాజ్యాంగ వేడుకలు నిర్వహించారు. **బొబ్బిలి:** ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగం భారత రాజ్యాంగమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. లోక్‌సత్తా కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొబ్బిలి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

గజపతినగరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థుల విన్యాసం

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాధికారి మహేష్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు, సోంపురం జిల్లా పరిషత్తు ఉపాధ్యాయులు పి రమేష్ నాయుడు పాల్గొన్నారు. **గరివిడి :** చీపురుపల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు పతివాడ రాజారావు, మంగళగిరి శ్రీను, సుధారాణి, ఏ.ఓ. ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ ముజుకీర్, నాయకులు పాండ్రంకి వాస్, మీసాల లక్ష్మణ్, ప్రభాత్ కుమార్, గురాన జన, మండల ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుబర్తిలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

గుర్ల: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెనుబర్తి గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను చేపట్టారు. అంబేద్కర్ ఇండియా మిషన్(ఎయిమ్) జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు ఆధ్వర్యంలో, జిల్లా ఎయిమ్ ఇంచార్జి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్పి ఎస్. చక్రవర్తి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ పుర వీధులలో డప్పులు, మేళాలతో మహనీయుడు అంబేద్కర్ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సేవాదళ్, ఎయిమ్ గుర్ల మండల కన్వీనర్ టి. నారాయణప్పుడు, దాసరి గోవింద, దివాకల సూర్యనారాయణ, లోపింటి లక్ష్మణరావు, బసవ సూర్య నారాయణ, సిఐటియు నాయకులు అంబల్ల గౌరి నాయుడు, గ్రామ ఎయిమ్ కమిటీ సభ్యులు గుంట గౌరి, దేబార్కి గుడిసి రాము, దేబార్కి ఆదినారాయణ, ఏల కసవయ్య, దేబర్కి గౌరీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్పి ఎస్. చక్రవర్తి

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న రాజారావు

ఏపి పంచాయతీ రాజ్ ఛాంబర్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు, జిల్లా అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అన్నారు. ఆదివారం తిరుపతిలో ఏపి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వైవిబి రాజేంద్రప్రసాద్‌ని వీరిద్దరూ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేంద్ర ప్రసాద్ నాయకత్వంలో పంచాయతీ రాజ్ ఛాంబర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని గ్రామ పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలకు ఎటువంటి అధికారాలు లేకుండా పోయిందన్నారు. వీధి లైట్లు, తాగు నీరు, పారిశుధ్య పనులు కూడా చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రి వేళల్లో లీకుల నివారణ

ప్రజాశక్తి- బొబ్బిలి

లీకులను పూడ్చుతున్న సిబ్బంది

పట్టణ ప్రజల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ ఉద్యోగులు రాత్రి వేళలో మున్సిపల్ పైపులైన్ లీకులను నివారించే పనులు చేపట్టారు. చినబజారు జంక్షన్లో పైపులైన్ లీకుతో తాగునీరు వృథాగా పోతుంది. లీకును నివారించాలంటే తాగునీటి సరఫరాను బంద్ చేయాలి. పగటిపూట పనులు చేస్తే తాగునీటి సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్న కారణంతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది రాత్రి సమయంలో లీకుల నివారణ పనులు చేపట్టారు.

ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

'జనసేన అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి- రామభద్రపురం

రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ వ్యవస్థాపకులు సినీ హీరో పవన్ కళ్యాణ్ నేతృత్వంలో బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆరికతోటలో ఆ పార్టీ యువకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ యువ నేత కనకల శ్యామ్ మాట్లాడుతూ జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి ఆదేశాల మేరకు ఇక్కడ 'మై ఫస్ట్ ఓట్ ఫర్ జనసేన' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క యువ ఓటర్‌ను కలిసి ఓటు ఆవశ్యకత గురించి తెలియజేస్తూ జనసేన సిద్ధాంతాలను వివరించి రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మొట్ట మొదటిగా వినియోగించుకుంటున్న ఓటును జనసేనకే వెయ్యాలని అభ్యర్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లు రమేష్, వల్లూరు జగదీష్, పొందూరు సత్యనారాయణ, కోమటిపల్లి చీమల సతీష్, కనకల కుమార్, పల్లా తరుణ్, వల్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకాశ దీపం ప్రజ్వలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ రాజీ పేటలోని శ్రీ గాయత్రి తపస్వి శంబల నగరిలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆకాశదీపం ప్రజ్వలన కార్యక్రమాన్ని వైభవపేతంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 1800 కిలోల గాయత్రి అమ్మవారి విగ్రహం దేశంలోనే అతిపెద్ద పంచలోహ విగ్రహమని ఈ విగ్రహానికి ధూప దీప నైవేద్యాలు కొబ్బరికాయలు కొట్టడం వంటి సంప్రదాయాలు ఉండవని గుర్తు చేశారు. మహిళలు ఏ పరిస్థితులలో ఉన్న విగ్రహాన్ని నేరుగా తాకి కష్టాలను చెప్పుకోవచ్చునన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం హెూమాలు, భక్తులకు ఆశ్రమ సర్వదర్శనం, మధ్యాహ్నం అన్న సమారాధన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం ఋషి చైతన్యంతో వెలిగించే ఆకాశ దీపానికి 200 కేజీల ఆవు నెయ్యితో 300 మీటర్ల దీపం ఒత్తును 9 కేజీల కర్పూరంతో వైభవంగా ఆకాశదీపం ప్రజ్వలన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు గంగరాజు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న నక్కెళ్ళ గంగరాజు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించి ఝార్ఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో గంగరాజును హెచ్ఎం జివిఎస్ కాంతారావు, పీడీలు సూర్యారావు, షరీఫ్ ఆదివారం అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణంలో ఆదివారం జీవనజ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. హెచ్ఐవి బారిన పడిన కుటుంబాలకు, వికలాంగులకు, కిడ్నీ, కేన్సర్, లెప్రసీ మొదలగు వ్యాధి గ్రస్తులకు చెందిన 50 కుటుంబాలకు అమ్మ ఫౌండేషన్ పాండ్రంగి సంతోష్ కుమార్, ప్రతినిధుల చేతుల మీదుగా నిత్యవసరాలను అందజేశామని జీవన్ జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగూర్ భాష తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, బాధిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

వనభోజన సందడి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తప్పెటగుళ్లు వేస్తున్న యాదవులు

మండలంలోని సిపి ఆక్వా పరిశ్రమ సమీపంలోని మామిడితోటలో ఆదివారం ఘనంగా యాధవ్ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. యాదవ నాయకుడు నక్కాన రమణ అధ్వర్యంలో జరిగిన వనభోజన కార్యక్రమానికి వేలాది మంది యాదవులంతా అక్కడకు చేరుకొని వారి దైవం శ్రీకుష్ణుడు విగ్రహానికి పూలమాలలతో అభిషేకం చేశారు. వనభోజన ప్రాంగణమంతా కోళాటం, తప్పెటగుళ్లతో హోరెత్తించారు. ఈ వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జనసేన నియోజకవర్గం నాయకులు లోకం మాదవి, జిల్లా యాధవ సంఘం అధ్యక్షులు మన్యాల కృష్ణ తదితర పెద్దలు హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ యావులంతా కలిసి కట్టుగా వనభోజన కార్యక్రమం జరుపుకోవడాన్ని అభినందిస్తున్నామన్నారు. లోకం మాదవి మాట్లాడుతూ యాదవులంతా ఐక్యమత్యంగా ఉంటే ఎలాంటి కార్యక్రమాలైనా విజయవంతగా చేసుకోవచ్చున్నారు. మన్యాల కృష్ణ మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉండి ఒకరికి ఒకరు సహకారం చేసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యాదవ సంఘం నాయకులు నక్కాన రమణ మాట్లాడుతూ సుమారుగా 5 వేలకు పై గా యాదవులు హజరవడం ఆనందంగా ఉందన్నారు. డొప్పుజోగులు, పల్లసత్యం, గుడ్డాల రమణ, కుమిలి శ్రీను, దువ్వ ఆధి, చింతపల్లి సూరిబాబు, కొణతాల పాలెం రమణ తనకు ఎంతో సహకారం అందించారన్నారు.

జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూబీసీ లంటే జగన్ రెడ్డికి చులకనని బిసి బ్యాక్ లాగ్ పోస్టులు 70 వేలు ఉన్నా భర్తీ చేయలేదని ఉన్నత పదవులు, నామినేటెడ్ పదవుల్లో బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి రీజినల్ ఇంచార్జులు అందరూ రెడ్డి సామాజికవర్గం వారే ఉన్నారని ఒక్క ఇంచార్జ్ పదవి బీసీకి జగన్ ఇవ్వలేదని గుర్తు చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్స్ ఇస్తానని మాట ఇచ్చి తప్పారని, చంద్రబాబు బీసీలకు పెద్ద పీఠ వేశారని అన్నారు. వైసిపి నాయకులు కబ్జా చేసిన భూములను చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత వెనక్కు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బీసెట్టి అరుణ, రొంగలి రమణ, బీసెట్టి మోహన్, గనివాడ బంగారునాయుడు, బడిగంటి రవీంద్రనాధ్, బొనంగి జ్యోతి, పెదగడ రాజు, బుత్తల సన్యాసిరావు పాల్గొన్నారు.

గరివిడి : ఆంధ్ర రాష్ట్రంలో బీసీలకు జగన్మోహన్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని చీపురుపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు వెన్నె సన్యాసి నాయుడు, పైల బలరాం, దన్నాన రామ చంద్రుడు, ముల్లు రమణ అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రూ.75,760 కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. బీసీ రిజర్వేషన్లు 34శాతం నుండి 24శాతం వరకు తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. 70 వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఈ సమావేశంలో రౌతు నారాయణరావు, ఆరతి సాహూ, పనస మణికంఠ, రేగిడి వాసు, మీసాల కాశీ, కొంద్రు లక్ష్మణ రావు, నాగులపల్లి నారాయణ రావు, ఇడదాసు వెంకట రావు, లుకలాపు సాధు నాయుడు, రేవళ్ల మల్లేశ్వరరావు, గదుల అప్పలస్వామి, గిడిజాల సూర్యనారాయణ, అంపోలు సత్యం తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలపైన దాడులకు పాల్పడుతోందని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఆయన ఇంటివద్ద ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం బీసీ నాయకులను చంపడంతో పాటు వారికి చేస్తున్న అన్యాయంపై పార్టీ విడుదల చేసిన పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో 74మంది బీసీ నాయకులను ఈ ప్రభుత్వం క్రూరంగా చంపిందని ఆరోపించారు. 5వేల మంది బీసీలపై దాడులకు పాల్పడి వారిపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. అందుకు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ దాసరి అప్పలస్వామి, నాయకులు మండల పృద్విరాజ్, కోరాడ రాంబాబు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక చైతన్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రక్తదానం సామాజిక చైతన్యమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుభోతు దుర్గాప్రసాద్ 60వ సారి రక్తదానం సందర్భంగా జరజాం ప్రపేటలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఐ పి. నారాయణరావు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సామాజిక చైతన్యంతో రక్త దానం, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాధన యువజన సంఘం సామాజిక చైతన్యంతో చేస్తున్న సేవలు మరువలే నివని కొనియాడారు. అనంతరం రక్తదాత దురాప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, పి.సత్యనారాయణ, మద్దిల శ్రీనివాసరావు, అవనాపు మురళి, నల్లి శివ పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గరివిడి: ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా శ్రీరామ అటానమస్ డిగ్రీ కళాశాలలో 14 ఆంధ్ర బెటాలియన్ రక్తదాన శిబిరాన్ని ఆదివారం ప్రారంభించింది. డిఎస్‌పి ఏఎస్ చక్రవర్తి మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరిన విద్యార్థులందరూ కష్టపడితే వారి వ్యక్తిగత జీవితానికి ఎన్‌సిసి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30 మంది ఎన్‌సిసి స్టూడెంట్స్ రక్తాన్ని దానాన్ని పరిశీలి ంచారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాకాడ శ్రీను, సర్పంచ్ ప్రమీల కుమార్, జి రామకృష్ణ, ప్రిన్సిపల్ బి.రవి పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 51మంది రక్తదాతలు పాల్గొని రక్త దానం చేశారు. రక్తదాతల ద్వారా సేకరించిన రక్తాన్ని విశాఖపట్నంనకు చెందిన యన్.టీ.ఆర్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. ఈ సందర్భంగా సహాయస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు సాయి కుమార్ ,సాయి రేవంత్ మాట్లాడుతూ ' రక్తదానం సామాజిక బాధ్యత అనే నినాదంతో తమ ఫౌండేషన్ ముందుకు వెళ్తుందన్నారు.

ఆ రహదారంటే భయం... భయం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

బొబ్బిలి, తెర్లాం రోడ్డులో ప్రయాణం చేయాలంటే భయం, భయంగా ఉందని చోదకులు వాపోతున్నారు. విశాఖపట్నం నుండి రాయగడ, రాయగడ నుండి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలు గతంలో పారాది మీదుగా వెళ్ళేవి ప్రస్తుతం పారాది వంతెన పాడవడంతో భారీ వాహనాలు బొబ్బిలి మీదుగా తెర్లాం రోడ్డు ఆకులకట్ట మీదుగా బాడంగి, రామభద్రపురం నుండి హైవే చేరుకొని విశాఖ, రాయగడ రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో బొబ్బిలి, తెర్లాం రోడ్డు భారీ వాహనాలు తిరగడంతో పూర్తిగా పాడై పోవడంతో భారీ వాహన చోదకులు, శ్రీకాకుళం, రాజాం, బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులు ప్రతి రోజు భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రహదారిలో ప్రతిరోజు భారీ వాహనాలు గోతుల్లో కూరుకు పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా 10 టన్నుల సామర్థ్యం గల రోడ్లలో 40, 50 టన్నుల భారీ వాహనాలు వెళ్లడం వల్లనే ఈ రోడ్లు పాడయ్యాయని చెప్పారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన లారీ

టిడిపి సునామీలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయం

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాబోయే ఎన్నికల్లో టిడిపి సునామీలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయమని చీపురపల్లి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. మెరకముడిదాం మండలం పూతికవలస గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరాయి. చీపురుపల్లిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగార్జున వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ టిడిపి - జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆయన సారధ్యంలో రాష్ట్రం అని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం మాజీ ఎంపిపి తాడ్డి సన్యాసినాయుడు, పార్టీ నాయకులు కెంగువ ధనుంజయ, జమ్ము శంకరరావు, పిన్నింటి సన్యాసి నాయుడు, ముదునూరు కృష్ణరాజు, ఆవాల అప్పలనాయుడు, ముల్లు రమణ, కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో నాగార్జున

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పాల్గొని ముందు వేణుగోపాలస్వామి ఆలయంలోనూ, సత్యసాయి బాబా ఆలయంలోనూ పూజలు నిర్వహించుకుని గ్రామంలో ఇంటంటికి తిరిగి మిని మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చంద్రబాబును గెలిపించడానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు గెలిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గం అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, ముక్క రామకృష్ణ, సిరికి రమణ, గుర్రపోటి రమణ, సేనాపతి గణేష్, మంచిని అప్పలసూరి, గొర్లె నాగరాజు, చామలాపల్లి, కరకవలస, వీలుపరితి, కెఆర్ పేట, ఎస్ కోట, ఎల్ కోట, కొత్తవలస, జామి మండలాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వర్గానికి చెందిన జగ్గయ్యపేట టిడిపి నాయకులు గొంప కృష్ణ నేతృత్వంలో పనిచేస్తామని ఆయన సమక్షంలో పార్టీ కండువాలు వేసుకున్నారు.

వేపాడ: ఇంటింట ప్రచారం చేస్తున్న గొంప కృష్ణ తదితరులు

బొడ్డపేటలో భవిష్యత్తుక గ్యారెంటీ

నెల్లిమర్ల: మండలంలోని బొడ్డపేటలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ సమన్వయకర్త, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం పంట పొలాల్లో తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. పంట పొలాల్లో తిరిగి లిభవిష్యత్ గ్యారెంటీ బాండ్లులి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువ్వాడ రవి శేఖర్ మాట్లాడుతూ చంద్రబాబును గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి మొంగం శ్రీనివాసరావు, వల్లూరు నాయకులు పంచాది జగన్నాథం, వైస్ ప్రెసిడెంట్ తలచుట్ల మహాలక్ష్మి నాయుడు, బూత్ ఇంచార్జ్ పాలవలస పాపినాయుడు, రాము నాయుడు, పున్నాన రమణ, పెంటయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: భవిష్యత్తు బాండ్లును పంపిణీ చేస్తున్న రవిశేఖర్

నిలిచిన అదనపు భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - వేపాడ

నాడు నేడు రెండో విడత అదనపు భవనాల నిర్మాణపు పనులు మధ్యలో నిలిచి పోయాయి. దీంతో పాఠశాలల విద్యార్థులు గదులు చాలాక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు చెబుతున్నారు. దీంతో ఎప్పటి మాదిరిగానే విద్యార్థులు చాలీచాలని ఇరుకు గదుల్లో చదువులు వెళ్లదీయాల్సి వస్తుంది. ప్రభుత్వం విద్యకు వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటనలో చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కాకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ముఖ్యంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దొంగాడ ఎంపిపి పాఠశాల, కేజీబీవీ వసతి గృహం, వావిలపాడు జిల్లా పరిషత్ పాఠశాల, సోంపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణపు పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అదనపు గదులకు అవసరమైన నిధులను విడుదల చేసి పనులు పూర్తి చేస్తే తప్ప ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశాలు లేవని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరు మృతి

ప్రజాశక్తి- భోగాపురం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్.ఐ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన ఉప్పాడ నూకరాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఈనెల 22వ తేదీన భార్య ఊరికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న వ్యవసాయానికి ఉపయోగించే పురుగుల మందును తాగేశాడు. దీంతో కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. భార్య యల్లయ్యమ్మ ఫిర్యాదు చేశారు. పూసపాటిరేగ మండలానికి చెందిన కోలా రాములు (30) ఆరవిందో కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన తగరపువలస వెళ్తుండగా అవనాం కూడలి వద్ద బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే 108లో తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కె.జి.హెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్.ఐ తెలిపారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బుధరాయవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తు మరణించిన ఎం. మన్మధరావు సతీమణి వసంత లక్ష్మీకి మెరక ముడిదాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యాలయపు సహాయకులుగా కారుణ్య నియామక పత్రాలును ఆదివారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన కార్యాలయంలో అందచేశారు. అనంతరం జెడ్‌పి నిధులు నుండి బిసి ఉమెన్స్ హాస్టల్‌కి ఇరువై ఫ్యాన్లను హాస్టల్ వార్డెన్‌కి అందచేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రాజకుమార్ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

2న రేగిడి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిసెంబర్ 2 మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ హాజరవుతారన్నారు. 23 శాఖాధికారులు గ్రామస్థాయి పనులు, సమస్యలపై పూర్తి సమాచారంతో రావాలని తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి నాయకులు హాజరు కావాలన్నారు.

నేడు బైక్ వేలం

ప్రజాశక్తి - వంగర

మద్యం కేసులో పట్టుబడిన సిబిజెడ్ ద్విచక్ర వాహనాన్ని రాజాంలో గల ఎస్ఇబి కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఆర్ జనార్దన్ రావు తెలిపారు. ఆశక్తి గలవారు రాజాంలో ఎస్ఇబి అధికారులను సంప్రదించాలని కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఓటర్ల జాబితాలో మరణించి వారి పేర్లు తొలగించలేదనే సమాచారం పై మండల తహశీల్దార్ విజయ భాస్కర్ ఆదివారం మండలంలోని బైరిపురం పంచాయతీకి సంబంధించిన నాలుగు పిఎస్‌ల ఓటర్ల జాబితాను పరిశీలించారు. చీపురుపల్లి నియోజక వర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో ఉన్న అన్ని పిఎస్‌లకు సంబంధించిన ఓటర్ జాబితాల్లో మరణించిన వారి పేర్లను తొలగించాలని ఆయా పిఎస్‌లకు సంబంధించిన బిఎల్ఒలకు, వాటికి సంబంధించిన అధికారులకు తెలిపినా వాటిని తొలగించలేదన్నారు. వాటిని తొలగించాలని టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కిమిడి నాగార్జున జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాబితాను పరిశీలించామన్నారు. అయితే ఇప్పటికే ఓటర్ జాబితాలు నుండి డెత్ పేర్లను తొలగించటం జరిగిందని, ఇంకా ఏమైనా ఉంటే వాటిని కూడా తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ పరిశీలనలో మాజీ సర్పంచ్ కెంగువ ధనంజయ, విఆరఒ కార్తికేయ పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న తహశీల్దార్